నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

11 | హైదరాబాద్, బుధవారం 21 ఫిబ్రవరి 2024 | HYDERABAD

GHMC

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు 9 నామినేషన్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మంగళవారం ప్రారంభం అయింది. తొలి రోజు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు తొమ్మిది మంది నామినేషన్ దాఖలు చేశారు. ఆవుల రవీందర్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కంది శైలజ, సబిహాబేగం, మన్నె కవితారెడ్డి, లాస్య దూసరి, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, చింతల విజయశాంతి, సబితా కిశోర్ నామినేషన్ వేశారు. కాగా చివరగా తొమ్మిది మందిలో ఒక్కరు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

కేసు వివరాలను వెల్లడిస్తున్న శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు

7.20 ఎకరాలు కబ్జాకు యత్నం

బీజేపీ నాయకులు రిమాండ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : ప్లాట్లు కొనుగోలు చేసిన మహిళలపై దాడి చేసి, 7.20 ఎకరాల భూమిని కబ్జాకు యత్నించిన బీజేపీ నాయకులను రిమాండ్‌కు తరలించినట్లు శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... శంషాబాద్ మండలంలోని చౌదర్‌గూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని కే ఎంఆర్ఆర్ వెంచర్ పేరుతో డాక్టర్ కాలనీ ఫేజ్-3ని ప్లాట్లుగా చేసి అమ్మేశారు. వాటిని కొనుగోలు చేసిన 30 నుంచి 40 మంది సోమవారం అక్కడికి వచ్చారు. అప్పటికే బీజేపీ నాయకులు ప్లాట్ల చుట్టూ ఉన్న కడీలు, ప్రీకాస్ట్‌ను ధ్వంసం చేస్తుండగా వారిని అడ్డుకున్నారు. ఈ గొడవలో మహిళలపై బీజేపీ నాయకులు అసభ్యంగా ప్రవర్తిస్తూ వీడియోలు తీశారు. అలాగే వారి ఫోన్లు లాక్కొన్నారు. దీంతో బాధితులు 100కు కాల్ చేశారు. సీఐ శ్రీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులపై దాడి చేసిన బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. ఈ ప్లాట్ల కబ్జాకు గతంలోనూ బీజేపీ నాయకులు యత్నించినట్లు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. కబ్జాకు యత్నించిన అయ్యూబ్, మలచలం మోహన్ రావు, ఎం. కుమార్, నానవాల కుమార్‌యాదవ్, మన్నె ప్రవీణ్, మామిళ్ల మల్లేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చిన్నారిని భయపెట్టిండు..

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 20: చిన్నారిని భయపెడుతున్న ఓ వ్యక్తికి వీఎస్‌పీఎల్ ఎంఎం నాంపల్లి కోర్టు రెండు రోజులు జైలు శిక్ష విధించింది. నారాయణగూడ పీఎస్ అడ్మిన్ ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కోఠి ఇసామియా బజార్‌కు చెందిన ఓ చిన్నారి(6) బషీర్‌బాగ్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 1వ తరగతి చదువుకుంటుంది. హిమాయత్‌నగర్ వీధి నం1లో ఉండే ఏ.సురేశ్(41) ఆటో డ్రైవర్. అదే స్కూల్‌కు పిల్లలను ఆటోలో తీసుకెళ్తూ, చిన్నారిని భయపెట్టాడు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి సురేశ్‌ను అదుపులోకి తీసుకోగా నేరాన్ని ఒప్పుకున్నాడు. మంగళవారం సురేశ్‌ను నాంపల్లికోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి సత్యనారాయణ అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

చెత్త నిర్వహణ అధ్వాన్నం

- జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో కార్పొరేటర్ల ఆగ్రహం
- స్వీపింగ్ యంత్రాల వినియోగంపై అభ్యంతరం
- శానిటేషన్, ప్రకటనలపై హౌస్ కమిటీకి నిర్ణయం
- రూ. 7,937 కోట్ల బల్దియా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం మంగళవారం అర్థవంతమైన చర్చల నడుమ ముగిశాయి. తొలిరోజు అడ్వర్టైజ్‌మెంట్, వీధి దీపాల నిర్వహణ, డిప్యూటేషన్ల అంశాలపై సభ్యులు, అధికారుల మధ్య చర్చ జరగగా..జీవో 68, అడ్వర్టైజ్‌మెంట్ విభాగంలో అక్రమాలు, అధికారుల అవినీతిని సభ్యులు ఎండగట్టారు. ప్రశ్నోత్తరాలు మిగిలిపోవడం..బడ్జెట్ చర్చ ఉండడంతో సభను మంగళవారానికి వాయిదా వేయగా, రెండోరోజు శానిటేషన్, స్పోర్ట్స్, టౌన్‌ప్లానింగ్, సెల్ఫ్ అసెస్‌మెంట్, బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలను అరికట్టలేకపోతున్నారని, రాంకీ నిర్వహణ, అధికారుల పనితీరుపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వీక్లీ మార్కెట్స్ నడిచే ప్రాంతాలు, డస్ట్ బిన్‌లు ఎత్తివేసిన ప్రాంతాల్లో చెత్త నిర్వహణ అధ్వాన్నంగా ఉందని పార్టీలకతీతంగా సభ్యులు మండిపడ్డారు. స్వీపింగ్ మిషన్ల నిర్వహణ సరిగా లేదని లోపాలను ఎత్తిచూపారు. దీనిపై శానిటేషన్ విభాగం అదనపు కమిషనర్ ఉపేందర్ రెడ్డి సమాధానం ఇవ్వలేక తడపడ్డారు. చివరకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జోక్యం చేసుకొని అఖిల పక్షంతో హౌస్ కమిటీ ఏర్పాటు చేశారు. దీంతో పాటు అడ్వర్టైజ్‌మెంట్ అక్రమాలపై మరో హౌజ్ కమిటీ వేశారు. ఈ క్రమంలోనే 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ రూపొందించిన అంచనా బడ్జెట్ రూ.7,937 కోట్లకు కౌన్సిల్ ఆమోదించింది.

2024-25 బడ్జెట్‌పై కౌన్సిల్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. రూ.3646 కోట్ల ఆదాయం చూపిస్తూ అన్ని ఖర్చు కలిపి రూ.3500 కోట్లు చూపుతున్నారని, ఈ నిధులతోనే ఏడాదంతా ఎలా అభివృద్ధి పనులు జరుపుతారో స్పష్టత లేదని ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అభ్యంతరం తెలిపారు. రూ.3వేల కోట్లు జీహెచ్ఎంసీకి ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్‌లో పెట్టాలని డిమాండ్ ఉన్నా రూ.1100 కోట్లు మాత్రమే పెట్టారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందన్నారు. రూ.3500కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు.

క్రీడా ప్రాంగణాల నిర్వహణపై అసంతృప్తి

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా క్రీడా ప్రాంగణాల నిర్వహణపై పార్టీలకతీతంగా సభ్యులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. పీజేఆర్ గ్రౌండ్స్‌లో మౌలిక వసతులు లేవని కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ మండిపడ్డారు. ఇండోర్ స్టేడియాల్లో ఫంక్షన్లు, ఇతర కార్యకలాపాల వల్ల క్రీడాకారులకు అందుబాటులో ఉండడం లేదని, సమ్మర్ క్యాంపుల నిర్వహణ సరిగా లేదని అన్ని పార్టీల నుంచి కార్పొరేటర్లు స్పోర్ట్స్ విభాగం అధికారుల తీరును తప్పుపట్టారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్లు కేటాయించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులను నిలిపివేయడం దారుణమని భారతీనగర్ కార్పొరేటర్ సిందూ ఆదర్శరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీ వర్సెస్ ఎంఐఎం

ట్యాక్స్ వసూళ్ల అంశంలో ఎంఐఎం, బీజేపీ కార్పొరేటర్ల మధ్య వివాదం చోటు చేసుకుంది. పాతనగరంలో పెండింగ్ ట్యాక్స్‌పై కమిషనర్ ప్రకటన చేయాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. దీనిపై ఎంఐఎం సభ్యుల మధ్య బీజేపీ కార్పొరేటర్ల మధ్య కొద్ది సేపు వివాదం జరగగా..ఇరువురి మధ్య వాగ్వాదంతో సభకు కొద్ది సేపు మేయర్ బ్రేక్ ఇచ్చారు. తర్వాత మేయర్ జోక్యం చేసుకొని వివరాలను బీజేపీ కార్పొరేటర్లకు చేరవేర్చుతామని చెబుతూ అంశానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. అంతకు ముందు శానిటేషన్‌పై చర్చ సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య వివాదం జరిగింది.

సెల్ఫ్ అసెస్‌మెంట్‌లో అవకతవకలు

సెల్ఫ్ అసెస్‌మెంట్‌లో అవకతకలు జరుగుతున్నాయని, లోపాలను సరిదిద్దాలని బీఆర్ఎస్ కార్పొరేటర్ సామల హేమ, బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్‌ను కమర్షియల్‌గా మార్చుతున్న వాటిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. హైటెక్‌సిటీ, సరూర్‌నగర్‌లో ఒకే లాగా ట్యాక్స్ వసూలు ఉంటుందని, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు లక్షల్లో పైస్థాయి అధికారులకు లంచాలు ఇచ్చే స్థాయికి చేరారని బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ ప్రతిపాదన

జీహెచ్ఎంసీకి వచ్చే ఆదాయంలో పెద్ద మొత్తం ఆదాయ పన్ను వసూళ్ల ద్వారానే సమకూరుతుందని కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. నాన్ రెసిడెన్షియల్‌కు ఏ విధంగా ట్యాక్స్ ఫిక్స్ చేయాలన్నది చట్టంలో ఉందన్నారు. జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా డోర్ నెంబర్ రేషనలైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. తద్వారా ఆదాయం పెంచడానికి దోహదం చేస్తుందన్నారు. రెసిడెంట్, నాన్‌రెసిడెంట్‌పై ట్యాక్స్ వేర్వేరు రేట్లు ఉన్నాయని, రేట్ల మార్పుపై 2017, 2019లో జీవోలు వచ్చాయన్నారు. సెల్లార్‌లో ఉన్న పార్కింగ్ స్థలాన్ని ఇతర అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్తిపన్ను చెల్లింపులకు వన్ టైం సెటిల్‌మెంట్ పథకం మళ్లీ అమలు చేయాలని, కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కార్పొరేటర్లు మేయర్‌ను కోరగా, ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని కమిషనర్ చెప్పారు.

కొండగల్‌కే కాదు.. మల్కాజ్‌గిరికి నిధులు ఇవ్వాలి

ప్రస్తుతం సీఎంగా రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు నిధులు ఇచ్చినట్లే మల్కాజ్‌గిరికి కూడా ఇవ్వాలని కార్పొరేటర్ సునీతా యాదవ్ డిమాండ్ చేశారు. ఎంపీగా ఉన్న సమయంలో నాలాలో పడి పాప చనిపోతే వచ్చి పరిశీలించారని, నాలా పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు.

జోనల్ కమిషనర్లపై గుర్రు

జోనల్ అధికారులు కార్పొరేటర్ల ఫోన్లు చేసినా స్పందించకపోవడంపై మేయర్ సీరియస్ అయ్యారు. డిప్యూటేషన్, ఎక్స్‌టెన్షన్ (రిటైర్డ్ ఉద్యోగుల) కొనసాగుతున్న అధికారులను సరెండర్ చేయాలన్నారు. ఎక్కువ కాలం పనిచేస్తున్న, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారి లెక్కలు తయారు చేయాలని మేయర్ ఆదేశించారు. లిస్ట్ రెడీ అయ్యాక ప్రభుత్వానికి సరేండర్ లేదా ఇతర శాఖలకు వారిని పంపే ఆలోచన చేయాలని కమిషనర్‌కు మేయర్ సూచించారు.

కౌన్సిల్‌కు ఎస్‌బీ అధికారి

కౌన్సిల్ మీటింగ్ కొనసాగుతున్న సమయంలో అనుమతి లేకుండా ఎస్‌బీ అధికారి రావడం చర్చనీయాంశమైంది. శానిటేషన్‌పై సభ్యులు ఆసక్తికర చర్చ జరుగుతున్న తరుణంలో కార్పొరేటర్లు కౌన్సిల్‌లోకి వచ్చే మార్గం ద్వారా సదరు ఎస్‌బీ అధికారి ఇబ్రహీం కౌన్సిల్ హాల్‌లోనికి వచ్చారు. అయితే నిబంధనల ప్రకారం ఇలా కౌన్సిల్ సమావేశంలోకి రాకూడదు. దీనిపై కౌన్సిల్ సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు.

డబుల్ ఇండ్ల లబ్ధిదారుల ఆందోళన

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను తమకే ఇవ్వాలని మంగళవారం కలెక్టరేట్‌లో లబ్ధిదారులు ఆందోళన చేశారు. పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని పర్వతాపూర్‌లో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించింది. నగరంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు డ్రా పద్ధతిన ఎంపిక చేసి, సర్టిఫికెట్లను అందజేశారు. అయితే స్థానికులు తమను కాదని స్థానికేతరులకు ఎలా కేటాయిస్తున్నారని కొంత కాలంగా పీర్జాదీగూడలో ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ ఆందోళనకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో మంగళవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. తమకు ఇచ్చిన సర్టిఫికెట్లను చూపిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తమకు డబుల్ బెడ్‌రూంలను మంజూరు చేస్తూ ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేశారన్నారు. తీరా అక్కడికి వెళ్తే ఎవరూ రానివ్వడం లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను తమకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులు

చలాన్లపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్‌పై ఏదీ?

ఇదేం చిత్రమని వాహనదారుల ఆందోళన

> మంగళవారం... ఉదయం 11 గంటలు.. నల్గొండ క్రాస్‌రోడ్డు నుంచి చాదర్‌ఘాట్ వరకు భారీగా ట్రాఫిక్ రద్దీ... మరో వైపు నల్గొండ క్రాస్‌రోడ్డులో వాహనాలకు చలాన్లు రాస్తూ ట్రాఫిక్ పోలీసులు... ఇదేంటని ఆశ్చర్యపోతున్నారా.. ? ట్రాఫిక్ గాలికొదిలేసి చలాన్లపైనే పోలీసులు ఫోకస్ పెట్టడంపైనే వాహనదారులు మండిపడుతున్నారు. ఇది ఒక చోటనే కాదు.. నగరంతో పాటు శివారు ప్రాంతాలలో కొందరు ట్రాఫిక్ పోలీసులు ఇలానే వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.
>
> - సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ)

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యపై నగర పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ జీవనదిలాంటిదని.. ఎప్పటికప్పుడు సాఫీగా సాగేలా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నగర ట్రాఫిక్‌పై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేస్తూ అవసరమైతే లా అండ్ అర్డర్ పోలీసులను కూడా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రద్దీ సమయంలో వాడుకోవాలని చెప్పారు. అలాగే కొత్తగా ట్రాఫిక్‌లో హోంగార్డులను నియమించాలని సూచనలు చేశారు. రద్దీ సమయాలలో చలాన్లపై కాకుండా, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపైనే దృష్టి పెట్టాలని ఉన్నతాధికారులు సిబ్బందికి సూచనలు చేశారు. ఉన్నతాధికారులు అలా ఉంటే సిబ్బంది మాత్రం టాఫిక్ రద్దీతో సంబంధం లేకుండా చలాన్లపై దృష్టి పెడుతున్నారు. ఇది మలక్‌పేట్‌లోనే కాదు.. నగరంలోని సికింద్రాబాద్, బేగంపేట్, మెహిదీపట్నం, అమీర్‌పేట్, నాంపల్లి వంటి రద్దీగా ఉండే ఇతర ప్రాంతాలలోను నడుస్తున్నది. ఇప్పటికైనా రద్దీ వేళల్లో క్షేత్ర స్థాయిలో విధి నిర్వహణలో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎండీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు

తాగునీటికి తండ్లాట లేదు

వేసవిలో తాగునీటి సరఫరాకు కార్యాచరణ.. జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంతోపాటు ఓఆర్ఆర్ పరిధి వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. జలమండలి ప్రస్తుతం రోజూ 565 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తుందన్నారు. అదనంగా మరో 15 నుంచి 20 ఎంజీడీల నీరు అవసరముందని అంచనా వేసిన మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో వేసవి కార్యాచరణ, ఎస్టీపీలపై జలమండలి ట్రాన్స్‌మిషన్, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజీఎం నుంచి మేనేజర్ స్థాయి వరకు క్షేత్రస్థాయిలో అధికారులు ప్రణాళికలు వేసుకుని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరా, కలుషిత నీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ట్యాంకర్లు, అదనపు నీటి కోసం వచ్చే వినతులను పరిగణలోకి తీసుకుని సత్వరమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. నీటి సరఫరా, ట్యాంకర్ల రవాణాపై విజిలెన్స్ అధికారులు డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. నగరంలో భూగర్భంలో నీటి మట్టాల స్థాయిపై నివేదిక తయారు చేసి అందించాలని ఎండీ ఆదేశించారు.

అవసరమైతే అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు

సంస్థ పరిధిలో ఉన్న బోర్‌వెల్స్ పనితీరును పరిశీలించి అవసరమైన చోట యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టమ్ (ఏఎంఎస్) కింద మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఎండీ ఆదేశించారు. నగర వ్యాప్తంగా ప్రస్తుతం 70 తాగునీటి ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా.. అవసరమైతే అదనపు స్టేషన్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు పొందాలని సూచించారు. అంతేకాకుండా అవసరం మేరకు ట్యాంకర్లు, ట్రిప్పుల సంఖ్యను పెంచుకోవాలని తెలిపారు. ఫిల్లింగ్ స్టేషన్లలో కరెంటు కోతలు, మోటారు రిపేర్లు, తదితర సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఇప్పటికే అన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. అన్ని స్టేషన్ల కెమెరాలు ప్రధాన కార్యాలయానికి అనుసంధానమై ఉన్నట్లు అధికారులు వివరించారు.

రేపు నల్లా నీళ్లు బంద్

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న సింగూరు ప్రాజెక్టులో భాగంగా పెద్దాపూర్ పంప్‌హౌజ్ దగ్గరున్న 132కేవీ సబ్‌స్టేషన్‌లో టీఎస్ ఎస్పీడీసీఎల్ నిర్వహణ పనులు చేపడుతున్నది. ఈ నిర్వహణ పనులు గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతాయన్నారు. ఈ నేపథ్యంలో షేక్‌పేట రిజర్వాయర్, భోజగుట్ట (పాక్షిక), బంజారా, ఎర్రగడ్డ రిజర్వాయర్ల ప్రాంతాల్లో (పాక్షిక), బోరబండ రిజర్వాయర్ ప్రాంతాలు (పూర్తిగా), ఖానాపూర్ గ్రావిటీ 1200 ఎంఎం మెయిన్ ఆన్‌లైన్ సప్లయి ప్రాంతాలలో నీటి అంతరాయం ఉంటుందన్నారు. ఈ ప్రాంత ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరారు.

నల్లా మోటర్లపై స్పెషల్ డ్రైవ్

ఎంసీసీ, ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాడానికి చర్యలు తీసుకోవాలని ఎండీ తెలిపారు. వాటర్ లీకేజీలు, సీవరేజీ ఓవర్ ఫ్లోలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలన్నారు. మ్యాన్ హోళ్లు ధ్వంసమైతే వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. కొంత మంది నల్లాకు మోటార్లతో నీటిని తోడుతున్నట్లు బోర్డు దృష్టికి వచ్చినట్లు, ఇలాంటి వారి కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకోవాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌కు ఆదేశించారు. అలాగే ఈ వేసవిలోనే రంజాన్ మాసం ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట్ల మసీదులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు. మసీదు ప్రాంతాల్లో సీవరేజీ ఓవర్ ఫ్లో లాంటి ఇబ్బందులు లేకుండా డివిజన్‌కొక మినీ జెట్టింగ్ మిషన్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ , రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఓఅండ్ఎం, ట్రాన్స్ మిషన్ సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీపీలపై సమీక్ష: అనంతరం ఎస్టీపీలపైనా ఎండీ సుదర్శన్ రెడ్డి సమీక్షించారు. చివరి దశలో ఉన్న ఎస్టీపీల పనుల్ని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.. అంతర్గత రోడ్లు, లైటింగ్, గార్డెనింగ్, వాల్ పెయింటింగ్ తదితర పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం. సత్యనారాయణ , ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.